తూర్పు చాళుక్యులు

తూర్పు చాళుక్యుల ప్రభుత్వం – సాంఘిక – మత పరిస్థితులు

బాదామి చాళుక్యుల పాలనా పద్ధతులనే చాలా వరకు వేంగీ చాళుక్యులు అనుసరించారు. రాజు నిరంకుశుడు. రాజ్యాధికారం వంశ పారపర్యంగా సంక్రమించేది. జేష్ఠ పుత్రునికే పట్టాభిషేకం. సత్యాశ్రయ, లోకాశ్రయ, శ్రీపృథ్వీ వల్లభ మహారాజు, పరమేశ్వరుడు, మహారాజాధిరాజు, భట్టారక.. బిరుదులు బాదామి చాళుక్యల నుంచి వేంగీ చాళుక్యులు (తూర్పు చాళుక్యులు) అనుసరించారు. రాష్ట్ర కూటులు, చోళులు, కళ్యాణీ చాళుక్యులు వీరికి సమకాలికులు.

రాజు

వేంగి చాళుక్యులు త్రిలింగరాజ్యాన్ని దక్షిణాన కాంచీపురం వరకు పాలించారు. విశాల రాజనీతితో రాజ్యాంగ పరిస్థితులకు అనుగుణంగా పాలించారు. రాజ్యంలో మహారాజు అగ్రగణ్యుడు సర్వస్వతంత్ర ప్రవర్తకుడు. రాజాధిరాజ, పరమేశ్వర, పరమ భట్టారక అనే మూడు ముఖ్యమైన బిరుదులున్నట్లు చాళుక్య శాసనాల ద్వారా తెలుస్తోంది. రాజ్యాన్ని విషయం, నాడు, కొట్టం, గ్రామం అనే పాలనా విభాగాలుగా చేశారు. రాజ్యతంత్రాన్ని నడపడానికి మహా ప్రధానమంత్రి మండలి ఉండేది. మంత్రి మండలిననుసరించి పాలన సాగేది. కొన్ని సమ యాల్లో రాజు సర్వస్వతంత్రుడుగా వ్యవహరించేవాడు. యువరాజును నియమించే అధికారం రాజుదే. పౌరజనపద సంఘాలు, మంత్రిమండలి రాజు నిర్ణయాన్ని అంగీకరించాలి.

రాజు తర్వాత సేనాపతి, యువరాజు, సామంత రాజులు ముఖ్యులు. వీరి తర్వాత పురోహితుడు, మంత్రి, వారికి నియోగాధికృత ప్రధాన పాత్ర వహిస్తారు. రాష్ట్రానికి (విషయం) అధిపతిని రాష్ట్రపతి లేదా విషయపతి అంటారు. వీరిని మన్నేయులు అని పిలిచేవారు. గ్రామాధిపతిని ఊర్గవుండ అని పిలిచేవారు.

సైన్యం

పాలనలో సైన్యం, న్యాయపాలన, వాస్తు నిర్మాణం, కోశం (ధనాగారం) ప్రధానపాత్ర వహించేవి. సైన్యాధికారిని సంధి విగ్రహాధికారి, మహాసామంతాధిపతిగా పిలిచేవారు. రాజ్య రక్షణలో సేనను హస్తి పకులు (ఏనుగులు), ఆశ్వికులు (గుర్రాలు), పదాతులు (సైన్యం)గా విభజించారు. కుంతములు, తోమరాలు, బాణాలు మొదలైనవి ఆయుధాలుగా ఉపయోగించేవారు. యుద్ధ సమయాల్లో సైనికులు సారాయి తాగి ఏనుగులకూ పట్టేవారు. గుర్రాలకు కవచాలు తొడిగేవారు. యుద్ధభూమికి పురుషుల తో పాటు స్త్రీలు కూడా వెళ్లేవారు. యుద్ధానికి భయ పడి వెనుకడుగు వేసిన వాళ్లకు స్త్రీ వేషం వేయించి శిక్షించేవారు. గ్రామాలు, దేవాలయాలను చోళ రాజులు కూల్చడంతో ప్రజలు వారిని దుర్మార్గులుగా పరిగణించే వారని శాసనాల ద్వారా తెలుస్తోంది.

ధనాగారం

రాజ్యానికి ముఖ్య ఆదాయాన్ని సమకూర్చడానికి అనేక సుంకాలు వసూలు చేసి ధనాగారాన్ని నింపేవారు. భూమిని వివిధ తరగతులుగా విభజించేవారు. భూ సారాన్ని బట్టి పన్నులుండేవి. ఫలసా యం అనుసరించి పన్నులుండేవి. పన్నులు లేని భూమిని ఉంబాలీ అని పిలిచేవారు. కొదెన, అనే పన్నుగుడుగులు తయారు చేసే వారిపై వేసేవారు. దేశంలో నదులు, నిక్షేపాలు, రాజుకే చెందుతాయి. పన్నుల ద్వారానే అధికభాగం ఆదాయం వచ్చేది. నజరానాల వల్ల కూడా ఖజానా నిండేది. చాళుక్య రాజుల కింద ఎలమంచిలి, పిఠాపురం ముదిగొండ, కోనహైవేయలు, కొలను మొదలైన రాజులు సామంతులుగా పనిచేశారు. వీరేకాక వెలనాడులు, కొండ పాడుమతులు, సాగివారు వేంగీచాళుక్యులకు అధికంగా సుంకాలు చెల్లించే వారు. వారికి మన్నే యులు, రాష్ట్రకూట వంటి ఉద్యోగులు సహకరించే వారు.

ప్రజలు – వర్తకులు – సాంఘిక పరిస్థితులు

వేంగీ చాళుక్యుల కాలంలో వర్తకం విరివిగా జరిగింది. క్రయ- విక్రయాలకు వర్తక సంఘాలు సంతలు ఏర్పరచేవారు. నిత్యావసర, భోగ వస్తువులు విరివిగా సంతల్లో ఉండేవి. పారశీక దేశం నుంచి నూనె దిగుమతి అయ్యేది. వర్తక సంఘాలు వారు చెల్లించే పన్నులు భూమి పన్నుతో సమానంగా ఉండేవి. సుంకాలు రెండు విధాలు. హెజ్జుంక లేదా పెర్జుంక పన్నులు భారీగా జరిగే వ్యాపారులపై విధించేవారు.

ఆకులు-పోకలు ఒకచోటు నుంచి మరో చోటుకు తీసుకొని పోయినపుడు చెల్లించే సుంకాన్ని బిల్కోదు అనేవారు. ఈ సుంకాలు వసూలు చేసే అధికారులను సుంకాధికరావని, సుంకము కైకొండుదేవని, పెర్జుంకడకనికార అని పిలిచేవారు. రాజు నియమించిన గుత్తేదారులు కూడా పన్నులు వసూలు చేసేవారు. పన్నుల నుంచి వచ్చే రాబడి – జమా – ఖర్చులను కరణాలు చూసేవారు. ముఖ్య కరణా న్ని ప్రముఖ కరణమని పిలిచేవారు. వడ్డ వ్యహారి, భండారి అనే ఉద్యోగులు కూడా ఉండే వారు. యుద్ధాలు, కరవు కాటకాలు వచ్చినపుడు ప్రతి సంవత్సరం ధనాగారం నుంచి కొంత ధనాన్ని తీసి నిల్వ చేసే వారు. ఈ డబ్బు ప్రజా సంక్షేమం, నీటిపారుదల, బాటసారులకు పానీయశాలలు, బ్రహ్మచారులకు ధర్మ సత్తరువులు, పాఠశాలలు (ఘటికలు) నిర్మాణానికి ఉపయోగించేవారు.

వైశ్యులు వర్తక-వాణిజ్యాలు అధికంగా చేసే వారు. వీరి వర్తక శ్రేణిని నకర అని పిలిచేవారు. నకర ప్రధాన కేంద్రంగా పెనుగొండ (పశ్చిమ గోదా వరి జిల్లా) ఉండేది. దీనికి 17 వివిధ శాఖలుండేవి. ఈ నకరాల గురించి క్రీ.శ. 16వ శతాబ్దం నాటి వైశ్యపురాణం గ్రంథం వివరిస్తుంది. నకర వర్తక శ్రేణుల తర్వాత తెలికలు సంఘం ప్రధానమైంది. గానుగల నుంచి నూనె తీసేవారు. ఇందులో వెయ్యి మంది వరకు

సభ్యులుండేవారు.

వేంగీచాళుక్య రాజ్యకాలంలో రాజరాజ చోడ గంగ క్రీ.శ. 1084లో వేంగీకి చోళ గవర్నరుగా పనిచేసి వర్తక సంఘాలకు సహాయం అందించాడు. ఈ కాలంలో శైవ మఠాలు, దేవాలయాల ద్వారా విద్య నడిచేది.

చైనా యాత్రికుడు హ్యూయాన్‌త్సాంగ్ క్రీ.శ. 7వ శతాబ్దంలో ఆంధ్రదేశం పర్యటించి ఆనాటి సంఘ వ్యవస్థ గురించి వివరించాడు. భూమి సారవంతమైందని, ప్రజలు చామన ఛాయ వర్ణం వారని, కర్కశంగా ఉంటారని, కళలు పట్ల ఆసక్తి చూపుతారని వివరించాడు. జనసాంద్రత లేని చోట్లు, అరణ్య ప్రాంతాల్లో బందిపోట్లు స్వైర విహారం చేసేవారని, బౌద్ధమతం బాగా ఆదరణ పొందినట్లు వివరించాడు. సంఘంలో బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులకు మంచి ఆదరణ ఉండేది. శాసనాల్లో పేర్కొన్న బోయలు, సవరులు, అధమ స్థాయిలో ఉండేవారని, విశ్వకర్మలకు (కంసాలి) సంఘంలో గౌరవం ఉండేదని తెలిపాడు. వీరు రాగి రేకులపై శాసనాలు లిఖించేవారు. వీరిని శాసన లేఖకులని పిలిచేవారు. సంఘంలో బాల్య వివాహాలు, బహు భార్యత్వం, భోగినీ స్త్రీలతో అధిక పరిచయాలు మొదలైన దురాచారాలుండేవి.

పొలాలకు నీటి సరఫరాకోసం నిగ్రంతి, తలారి, తోటి అనే అధికారులుండేవారు. గ్రామంలో ముహూర్తాలు నిర్ణయించడంలో జ్యోతిష్కుడు ముఖ్యపాత్ర వహించేవాడు. కమ్మరి, వడ్రంగి, కుమ్మరి, మంగలి, చాకలి, ఉపాధ్యాయుడు, గ్రామ ద్వాదశంలో సభ్యులుగా ఉండేవారు. వీరికి జీతాలుగా డబ్బుకు బదులు భూములు ఇచ్చేవారు. గ్రామా ల్లో భూములను బంజర్లు, బీళ్లు, సాగు భూములుగా విభజించారు. భూములకు మడి గట్టులే సరిహద్దులుగా ఉండేవి. కంచెలు లేవు. గ్రామంలో తగువులను గ్రామ ద్వాదశ సభ్యులు తీర్చేవారు. మాన్య గార, పటేలు, గౌండ అనే గ్రామాధికారులుండే వారు. వీరు న్యాయాధికారిగా, సైన్యాధికారిగా వ్యవహరించేవారు. దావాలు, న్యాయవాదులు లేరు. శిక్షలు గ్రామద్వాదశ సభ్యులే నిర్ణయించేవారు.

మత పరిస్థితులు:

వేంగీ చాళుక్యుల కాలంలో బౌద్ధ మతం క్షీణదశలో ఉన్నట్లు హ్యూయాన్‌త్సాంగ్ వివరించాడు. హైందవ మతం ఉచ్ఛదశలో ఉండేది. బౌద్ధ ఆరామాలన్నీ హిందూ దేవాలయాలుగా మారాయి. ఉదా: అమరావతిలో అమరేశ్వరాలయం (అమరారామం), ద్రాక్షారామం, కొమరారామం, క్షీరారామం, చాళుక్యరామం ఆనాటి హిందువుల పుణ్య క్షేత్రాలుగా మారాయి. చాళుక్య రాజుల్లో చాలామంది శివభక్తులు. రెండో విజయాదిత్యుడు వేంగీ రాజ్యం లో 108 శివాలయాలు నిర్మించాడు. నరేంద్ర మృగరాజు బిరుదు ఇతనిదే. చాళుక్యుల ఇష్టదైవం మహా సేనుడు. మొదటి చాళుక్య భీముడు ద్రాక్షారామ దేవాలయాన్ని నిర్మించాడు. చేబ్రోలులోని మహా సేన దేవాలయ జాతర బెజవాడ వరకూ జరిగేది.

బెజవాడ మల్లేశ్వరం, పిఠాపురం హుం కారి శంకారి దేవాలయాలు గొప్ప పుణ్యక్షేత్రాలు. మొదటి యుద్ధమల్లుడు బెజవాడలో కార్తికేయుని ఆలయం నిర్మించాడు. రాజరాజ నరేంద్రుడు కలిదండిలో చోళ సైన్యాధిపతులకు మూడు స్మారక స్థంభాలు నిర్మించాడు. శ్రీశైలం, అలంపురం, ద్రాక్షారామం ప్రధాన శైవ కేంద్రాలుగా పేరు పొందాయి.

ఈ కాలంలో జైనమతం కూడా ఆదరణ పొం దింది. వేంగీచాళుక్య రాజు విమలాదిత్యుడు జైన మహావీరుని అభిమానినని ప్రకటించుకున్నాడు. రెండో అమ్మరాజు సర్వలోకాశ్రయ – కటకాభరణ అనే రెండు జైన ఆలయాలు నిర్మించాడు. జైన శ్రమణులకు సత్తరువులు నిర్మించాడు. శివ – మహా సేనుడికి విజాయాదిత్యుడు, మొదటి యుద్ధమల్లుడు రెండు శైవ మఠాలు బెజవాడలో నిర్మిం చారు. అత్తిలి, బెజవాడ, కొలనుపాక ప్రాంతాలు జైనమతానికి ముఖ్య కేంద్రాలు. ప్రజలు జైనుల వసతి సౌకర్యాల కోసం అనేక దానధర్మాలు చేసి నట్లు శాసనాలు వివరిస్తున్నాయి. జైన మఠాలు విద్యా కేంద్రాలుగా విరాజిల్లాయి. కళ్యాణకారిక అనే వైద్య గ్రంథాన్ని ఉగ్రాదిత్యుడు అనే జైనుడు రచించాడు. అర్హనందన్, దిననందిన్ అనేవారు సుప్రసిద్ధ జైన గురువులుగా ప్రసిద్ధి పొందారు.

సాహిత్యం

శాసనాల్లో మొదటిసారిగా తెలుగు భాష కన్పి స్తోంది. క్రీ.శ. తొమ్మిదో శతాబ్దంలో మూడో గుణగ విజయాదిత్యుడు కాలం నుంచి దేశీయ సాహిత్యం ఆదరణ పొందింది. రాజరాజ నరేంద్రుని ఆస్థాన కవి నన్నయ భట్టారకుడు. వ్యాస మహర్షి సంస్కృతంలో రచించిన మహాభారతాన్ని తెలుగులోకి అనువదించాడు. ఆది, సభా, అరణ్య పర్వంలోని సగ భాగం రచించాడు. నన్నెచోడుడు రచించిన కుమారసంభవం ద్వారా వేంగీ చాళుక్యులు దేశీ సాహిత్యాన్ని ఆదరించేవారని తెలుస్తోంది.

పావులూరి మల్లన గణితసార సంగ్రహం తెలుగు పద్యాలతో రచించాడు. కన్నడ కవిత్రయం –పొన్నడు, పంపడు, నాగవర్మ కమ్మనాడు ప్రాంతానికి చెందినవారు. జైనమతానికి చెందిన వీరి ద్వారా జైన సాహిత్యం అభివృద్ధి చెందింది. విక్రమార్క విజ యాన్ని పంపకవి రచించాడు.

దేవాలయాలు

తూర్పు చాళుక్యులు నిర్మించిన దేవాలయ వాస్తు శైలిలో పల్లవ వాస్తు ప్రభావం కన్పిస్తుంది. అమ్మ రాజు రాజమహేంద్రవరం, రెండో విజయాదిత్యుడు 108 నరేంద్ర మగేశ్వరాలయాలు, మూడో గుణగ విజయాదిత్యుడు బిక్కవోలులో రాజ రాజేశ్వర, చంద్రశేఖర, గోలింగేశ్వర ఆలయాలు నిర్మించాడు. చాళుక్యభీముడు –1, సామర్లకోట, ద్రాక్షారామం ప్రాంతాల్లో భీమేశ్వ రాలయాలు నిర్మించాడు. యుద్ధమల్లుడు బెజవాడలో కార్తికేయ ఆలయాన్ని నిర్మించాడు.

తొలి తెలుగు పద్య శాసనం...

మధ్యయుగ ఆంధ్రదేశ చరిత్రలో క్రీ.శ. 624 నుంచి1075 వరకు 'వేంగి' రాజధానిగా పరిపాలించిన వంశస్థులు తూర్పుచాళుక్యులు. ఈ వంశానికి చెందిన ప్రముఖుల గురించి సంక్షిప్తంగా....

కుబ్జ విష్ణువర్ధనుడు (క్రీ.శ. 624-641)

బాదామి చాళుక్య వంశంలో గొప్పవాడైన రెండో పులకేశి సోదరుడు కుబ్జవిష్ణువర్ధనుడు. వేంగి ప్రాంతాన్ని జయించిన రెండో పులకేశి తన సోదరుడైన కుబ్జవిష్ణువర్ధనుని ప్రతినిధిగా నియమించాడు. క్రమంగా స్వతంత్ర తూర్పు చాళుక్య రాజ్యాన్ని స్థాపించాడు. ఈయనకి మొదటి విష్ణువర్ధనుడు అని పేరు. మొదట పిఠాపురం కేంద్రంగా పాలన కొన సాగించాడు. ఈయనకు విషమసిద్ధి, మకర ధ్వజుడు, కామదేవ వంటి బిరుదులున్నాయి. పిఠాపురంలో ప్రసిద్ధ కుంతి మాధవాలయం ఈయన కాలంలోనే నిర్మించారు. ఇతని భార్య అయ్యన మహాదేవి జైనమతాన్ని అవలంభించారు. ఈమె విజయవాడకు దగ్గరలో 'నెడుం బివనది' అనే జైన ఆలయాన్ని నిర్మించినట్లు తెలుస్తుంది. చైనా యాత్రికుడు హుయాన్‌త్సాంగ్ కుబ్జవిష్ణువర్ధనుని కాలంలో వేంగిని సందర్శించినట్లు చరిత్ర చెబుతుంది.

జయసింహవల్లభ (క్రీ.శ. 641-673)

ఈయన కాలంలో రాజధానిని పిఠాపురం నుంచి వేంగికి మార్చారు. తీరాంధ్రలో తొలి తెలుగు శాసనమైన 'విప్పర్ల శాసనం' ఈయన కాలంనాటిదే. హసనపుర ఘటిక జయసింహ వల్లభ కాలంలోనే స్థాపించారు.

రెండో విజయాదిత్య (క్రీ.శ. 806-846)

ఈయన నాలుగో విష్ణువర్ధనుని కుమారుడు. శివభక్తుడు. నూట ఎనిమిది యుద్ధాలు చేసిన ఘనుడు. జయించిన ప్రదేశాలన్నింటిలో శివాలయాలు (108) నిర్మించినట్లు తెలుస్తుంది. 'నరేంద్ర మృగరాజు' అన్న బిరుదు ఈయనదే.

గుణగ విజయాదిత్య (848-892)

తూర్పు చాళుక్య వంశంలో గొప్పవాడు గుణగ విజయాదిత్య. ఈయనకే మూడో విజయాదిత్య అని పేరు. కొంతకాలం రాష్ట్రకూట రాజైన అమోఘవర్షునికి ఈయన సామంతుడిగా వ్యవహరించాడు. రాష్ట్రకూట రెండో కృష్ణుడిని ఓడించి స్వతంత్రుడయ్యాడు. ఈయన విజయాలలో ప్రముఖ పాత్ర వహించిన సేనాని పండరంగడు వేయించిన శాసనమే 'అద్దంకి శాసనం'. దీనిని తొలి తెలుగు పద్యశాసనంగా గుర్తించారు. గుణగ విజయాదిత్య నర్మద, గంగ నదుల మధ్య డాహలులతో యుద్ధం చేసి రాజైన సంకిలుని ఓడించాడు. గుణగ విజయాదిత్యకున్న బిరుదు 'త్రిపురమర్త్య మహేశ్వర'.

మొదటి చాళుక్య భీమ (892-921)

విక్రమాదిత్యుడి కుమారుడు. చాళుక్య భీమవరం పట్టణ నిర్మాత. ద్రాక్షారామంలోని భీమేశ్వరాలయం ఈయన కాలంలో నిర్మించినట్లు చరిత్ర చెబుతుంది. విజయవాడకు దగ్గర ఇంద్రకీలాద్రిపై పార్థివేశ్వరాలయం కూడా ఈయన కాలంలో నిర్మించినట్లు తెలుస్తుంది. ఈయన ఆస్థానంలో 'మల్లప్ప' గొప్ప సంగీత విద్వాంసుడు. మల్లప్ప కుమార్తె చల్లవ్వ, గాంధర్వ గాన విద్యా విశారదగా పేరుగాంచింది. కవి వృషభ బిరుదాంకితుడైన ప్రముఖ కవి భట్టవామనుడు చాళుక్య భీముని ఆస్థానం వాడే. ఇతడు రాసిందే 'కావ్యాలంకార సూత్ర'.

నాలుగో విజయాదిత్య

మొదటి చాళుక్య భీముని కుమారుడు. కొల్లభిగండ, కలియర్తిగండ వంటి బిరుదులు ఇతనివే. కళింగపై దండెత్తి 'విరజ' వద్ద విజయ స్తంభాన్ని ప్రతిష్ఠించాడు.

మొదటి అమ్మరాజు (క్రీ.శ. 921-28)

రాజమహేంద్రవరం నిర్మాత. రాజధానిని వేంగి నుంచి రాజమహేంద్రవరానికి మార్చినట్లు తెలుస్తుంది.

రెండో యుద్ధమల్లు (928-935)

బెజవాడ శాసనం ఇతని కాలంనాటిదే. ఇతని సామంతుడే నన్నెచోడుడు(కవిరాజశిఖామణి). నన్నెచోడుడు తెలుగులో 'కుమార సంభవం'ను రాశాడు.

రాజరాజనరేంద్రుడు (1022-1061)

విమలాదిత్య, కుందవ్వల కుమారుడు. రాజేంద్రచోళుని మేనల్లుడు. సత్యాశ్రయ కులతిలక, సమస్త భువనాశ్రయ వంటి బిరుదులు ఇతనివే. కావ్యగీతి ప్రియుడు. ఇతని ఆస్థానంలోనివాడే 'నన్నయ'. నన్నయ తన సహచరుడైన నారాయణభట్టు సహకారంతో మహాభారతాన్ని తెలుగులోకి అనువదించే కార్యాన్ని చేపట్టి రెండున్నర పర్వాలు పూర్తి చేశాడు. తెలుగు భాషా సాహిత్య చరిత్రలో రాజరాజనరేంద్రుని కాలం ఒక మైలురాయి. 'గణిత సార సంగ్రహం'ను రాసిన పావులూరి మల్లన ఇతని కాలం వాడే. ఇతని అనంతరం ఇతని కుమారుడైన రాజేంద్రుడు కులోత్తుంగ బిరుదుతో చోళ-తూర్పు చాళుక్య రాజ్యాలను ఏకంచేసి పాలించాడు. తూర్పు చాళుక్యులు

మొత్తంగా వైదిక మతాభిమానులు. జైనం ఆదరించారనడానికి తార్కాణాలుగా అయ్యన మహాదేవి నిర్మించిన 'నెడుంబివనది' నిర్మాణాన్ని పేర్కొనవచ్చు. గుణగ విజయాదిత్యుని సేనాని పండరంగడు జైన బ్రాహ్మణుడు. సమాజంలో బ్రహ్మచర్యం (కార్పటి వ్రతం) పాటించారు. బ్రాహ్మణులకు దానమివ్వడం (బ్రాహ్మదేయములు) కనిపిస్తుంది. ఘటికలు ప్రసిద్ధ విద్యాకేంద్రాలుగా పేరొందాయి. తూర్పు చాళుక్యుల కాలంలో సామంతులు స్వయంప్రతిపత్తిని కలిగి ఉండేవారు.

ప్రాక్టీస్ ప్రశ్నలు..

1. తొలి తెలుగు పద్య శాసనం?

ఎ) చిక్కుళ్ల శాసనం బి) పెదవేగి శాసనం
సి) అద్దంకి శాసనం డి) ఈపూరు శాసనం

2. కింది వాటిలో పావులూరి మల్లన రాసింది?

ఎ) నీతిసారం బి)గణితసార సంగ్రహం
సి) కావ్యాలంకార సూత్ర
డి) కుమారసంభవం

3. తెలుగులో కుమారసంభవాన్ని రాసింది?

ఎ) కాళిదాసు బి) నన్నయ
సి) నన్నెచోడుడు డి) భట్టవామనడు

4. ఘటికలు అనేవి?

ఎ) సత్రాలు బి) విద్యాకేంద్రాలు
సి) దేవాలయాలు డి) బౌద్ధ ప్రార్థనాలయాలు

5. అనంతపద్మనాభ ఆలయం ఎక్కడుంది?

ఎ) మొగల్రాజపురం బి) ఉండవల్లి
సి) బిక్కవోలు డి) కీసరగుట్ట

6. రాజమహేంద్రవరం నిర్మాత...?

ఎ) మొదటి అమ్మరాజు బి)రాజరాజనరేంద్రుడు
సి) రెండో యుద్ధమల్లు డి) నాలుగోవిజయాదిత్య

7. రాజరాజనరేంద్రుని అస్థాన కవి..?

ఎ) నన్నయ బి) తిక్కన
సి) భట్టవామనుడు డి) ఎవరూకాదు

జవాబులు	1	2	3	4	5	6	7
	C	B	C	B	B	A	A

పూరీ జగన్నాథ ఆలయాన్ని నిర్మించింది?

వేంగీ చాళుక్యులు లేదా తూర్పు చాళుక్య వంశ చరిత్ర

మధ్యయుగ దక్షిణా పథంలో రాజకీయాధికారం ప్రధానంగా పశ్చిమ దక్కను ప్రాంతం, తూర్పున తమిళనాడు ప్రాంతాల్లో కేంద్రీకృత మైంది. ఆధిపత్యంకోసం సామంతులు, స్థానికులు ఎవరికి వారే స్వాతంత్ర్యం ప్రకటించుకోవడం, యుద్ధాలు, దోపిడీలు, హింసలు నిత్యకృత్యమయ్యాయి. తూర్పు చాళుక్యుల గురించి తెలుసుకునే ముందు, కర్ణాటకలోని బాదామి చాళుక్యుల గురించి కొంచెం తెలుసు కోవడం అవసరం.

బాదామి చాళుక్యులు

దక్షిణాపథంలో విజయనగర సామ్రాజ్య స్థాపనకు పూర్వం వెలసిన రాజ్యాల్లో బాదామి చాళుక్యరాజ్యం అతిప్రధానమైంది. వీరు క్రీ.శ. 550 సంవత్సరం నుంచి సుమారు రెండున్నర శతాబ్దాలు పాలించారు. వీరి రాజధాని వాతాపి లేదా బాదామి (బీజాపూర్ జిల్లా) బాదామి చాళుక్యుల్లో రెండో పులకేసి (క్రీ.శ. 609-642) అత్యంత ప్రసిద్ధుడు. ఇతడు రాష్ట్ర కూటులు, కదంబులు, ఉత్తర భారతదేశ చక్రవర్తి శ్రీహర్ష డిని ఓడించిన ధీశాలి. ఇతడి విజయాలను ఐహోలు శాసనం తెలుపు తోంది. కాంచీపురం సమీపంలో ఉన్న పుల్లలూరు యుద్ధంలో పల్లవ రాజు మహేంద్రవర్మను ఓడించాడు.

చైనా యాత్రికుడు హ్యూయాన్‌త్సాంగ్ చాళుక్యరాజ్య పరిస్థితులను తన గ్రంథం సీయూకీలో పొందుపర్చాడు. బాదామి చాళుక్యులు గొప్ప కళా పోషకులు. దక్కను పీఠభూమిలో ఎల్లోరా శిల్ప, చిత్రలేఖన కళావైభవం, ఐహోలు, బాదామి, పట్టడి కళ్‌ల్లో దేవాలయాలు నిర్మించారు.

బాదామి చాళుక్యులు వివిధ ప్రాంతాలను పరిపాలించారు. వీరి శాఖ ఆంధ్రదేశాన్ని వేంగీ చాళుక్యులు, మహారాష్ట్ర - కర్ణాటకను కళ్యాణీ చాళుక్యులు, గుజరాత్‌ను గుజరాత్ చాళుక్యులు, కరీంనగర్‌లో వేములవాడ చాళుక్యులు, ఖమ్మంలో ముదిగొండ చాళుక్యులు దక్షిణా పథాన్ని మధ్యయుగంలో వివిధ రాజధానులతో పాలించారు.

వేంగీచాళుక్యులు (తూర్పుచాళుక్యులు):

బాదామి చాళుక్యుల్లోని శాఖే వేంగీ చాళుక్యులు. మొదట పిఠాపురం తర్వాత పెదవేగిని రాజధానిగా తూర్పు తీరాంధ్రాన్ని సుమారు ఆరు శతాబ్దాలు పాలించారు. రెండో పులకేశి వేంగిని ఆక్రమించి ఆ రాజ్యానికి తన తమ్ముడైన కుబ్జవిష్ణు వర్ధనుడిని రాజ ప్రతినిధిగా నియమించి తర్వాత అతణ్ని స్వతంత్రుడిగా చేయడం వల్ల వేంగీ రాజ్యం క్రీ.శ. 6వ శతాబ్దంలో స్వతంత్ర రాజ్యమైంది. కుబ్జ విష్ణువర్ధనుడు 18 సంవత్సరాలు పాలించాడు.

కుబ్జ విష్ణువర్ధనుడు (క్రీ.శ. 624-642)

ఇతడు మరుగుజ్జు కావడంతో కుబ్జ విష్ణువర్ధనుడని అంటారు. విశాఖ పట్నం నుంచి గుంటూరు మండలం వరకు రాజ్యాన్ని విస్తరించాడు. విశాఖజిల్లా సర్వసిద్ధి తాలూకా కలవకొండ గ్రామంలో తన రాజ్యకాలం 18వ సంవత్సరంలో వేసిన శాసనం బట్టి ఇతడి రాజ్యం దివిసీమ వరకు వ్యాపించినట్లు తెలుస్తోంది. రాజధాని పిష్ఠపురం (పిఠాపురం). విష్ణుభక్తుడు. విషమసిద్ధి, మకరధ్వజుడు అనే బిరుదులున్నాయి. భార్య అయ్యణి మహాదేవి విజయవాడలో జైన దేవాలయాన్ని, జైన నెడుంబబసతి (వసతి) నిర్మించింది. ఈమె జైన మతాభిమాని.

జయసింహవల్లభుడు

విష్ణువర్ధనుడి అనంతరం అతని కుమారుడు మొదటి జయసింహ వల్లభుడు రాజ్యానికి వచ్చాడు. రాజ్యం నెల్లూరు వరకు విస్తరించింది. కృష్ణాజిల్లా గుడివాడ తాలూకాలో పెణుకపర్రు గ్రామాన్ని బ్రాహ్మణులకు దానం చేశాడు. పిష్ఠపురం (పిఠాపురం) నుంచి వేంగీకి రాజధానిని మార్చాడు. సర్వసిద్ధి అనే బిరుదు ఉంది. విశాఖపట్నం జిల్లా ఎలమంచిలి తాలూకాలో సర్వసిద్ధి నగరాన్ని నిర్మించాడు.

రెండో విజయాదిత్యుడు

తూర్పుచాళుక్య రాజుల్లో 11వ వాడు. మూడో గోవిందవర్మ రాష్ట్ర కూటరాజుకు సమకాలికుడు. మాన్యఖేతం రాష్ట్రకూటుల రాజధాని. రాష్ట్రకూటులు, కదంబులను జయించాడు. శత్రువులతో 108 యుద్ధాలు చేశాడు. విజయ చిహ్నంగా ఆంధ్రదేశంలో 108 శివాలయాలు నిర్మించాడు. శైవమతాభిమాని. నరేంద్ర మృగరాజు, చాళుక్యరామ, విక్రమధవళ అనే బిరుదులున్నాయి.

గుణగవిజయాదిత్యుడు (క్రీ.శ. 848-891)

ఇతడిని విజయాదిత్య-3 అని కూడా పిలుస్తారు. సుమారు 40 ఏళ్లు పాలించాడు. తూర్పు చాళుక్య రాజుల్లో అగ్రగణ్యుడు, ప్రతిభాశాలి. గుణకెనల్లాట, పరాచక్రరామ, త్రిపురామర్త్య మహేశ్వరుడు, వల్లభుడు అనే బిరుదులున్నాయి. పల్లవ రాజుల ప్రోత్సాహంతో తనపై తిరగబడ్డ నెల్లూరు ప్రాంత బోయలను సేనాపతి పాండురంగడుని పంపి అణచివేశాడు. నెల్లూరు, వీరికట్టమ్ కోటలను తగలబెట్టి కందుకూరి కోటను ఆక్రమించి, పులికాట్ సరస్సు వరకు ఉన్న ప్రాంతాన్ని వేంగీ రాజ్యంలో విలీనం చేశాడు. విజయాదిత్యుడు- 3 రాష్ట్ర కూటరాజు అమోఘ వర్షుని చేతిలో వీంగావల్లి యుద్ధంలో ఓడిపోయాడు. కొంత కాలం రాష్ట్రకూటులకు సామంతుడై కొన్నాళ్ల తర్వాత మళ్లీ రాజ్యానికొచ్చాడు. సాకలూరు శాసనం, ధర్మవరం, అత్తిలి, పిఠాపురం శాసనాలు విజయాదిత్యుని విజయాలు పేర్కొంటున్నాయి. విజయాదిత్యుడు

రాష్ట్ర కూటరాజు రెండో కృష్ణుడుని జయించి పాలీధ్వజం, గంగా, యమున, తోరణి చిహ్నాలను స్వాధీనం చేసుకున్నాడు. గుణగ విజయాదిత్యుడు బిక్కవోలు (బిరుదాంక ప్రోలు) అనే పట్టణం, అందులో చంద్రశేఖర ఆలయం నిర్మించాడు. బిక్కవోలు తూర్పుగోదావరి జిల్లాలో ఉంది.

మొదటి చాళుక్య భీముడు (క్రీ.శ. 892-922)

గుణగ విజయాదిత్యునికి పుత్రులు లేరు. తమ్ముడైన విక్రమాదిత్యున్ని యువరాజును చేయగా అతడు మరణించడంతో తమ్ముని కుమారుడైన మొదటి చాళుక్యభీముడు రాజ్యానికి వచ్చి వేంగీని 30 సంవత్సరాలు పాలించాడు. రాజ్యకాలమంతా రాష్ట్ర కూటరాజైన రెండో కృష్ణుడితో యుద్ధాలతోనే గడిచిపోయింది. పంపన రచించిన విక్రమార్జున విజయం, ముదిగొండ చాళుక్యుల శాసనాలు, బెజవాడ, అత్తిలి కసింకోట, శాసనాలు ఇతని చరిత్రకు ముఖ్యాధారాలు. శివభక్తుడు. తూర్పు గోదావరి జిల్లా గోదావరి ఒడ్డున సామర్లకోట సమీపంలో చాళుక్య భీమేశ్వరాలయం, ద్రాక్షారామంలో భీమేశ్వరాలయం నిర్మించాడు.

సామర్లకోట సమీపంలో చాళుక్య భీమపురం అనే నగరాన్ని నిర్మించాడు. దానికి పూర్వం స్కంధారామమని పేరు. చాళుక్య భీముడు గాంధర్వ విద్యా ప్రవీణురాలైన చల్లవ (చల్లాంబిక) అనే భోగినీ స్త్రీకి అత్తిలి గ్రామానికి చెందిన రెండు ఖండికల భూమిని దానం చేశాడు. బెజవాడ ఇంద్రకీల పర్వత శాసనం తెలుగులో వేయించాడు. శాసనంలో చాళుక్య భీమ-సర్వలోకాశ్రయ విష్ణువర్ధన మహారాజు అని పేరుంది. చాళుక్య భీముడి సామంతరాజైన చాత్రపుడు ఇంద్రకీలాద్రిపై పార్థీశ్వర దేవాలయం కట్టించాడు. మాలతీమాధవం రచయిత భవభూతి ఇతడికి సమకాలికుడని శాసనంలో ప్రస్తావన ఉంది.

మొదటి అమ్మరాజు

చాళుక్య భీముడి తర్వాత కొల్లాభిగండడు అనే పేరుతో నాల్గో విజయాదిత్యుడు ఆరు నెలలు పాలించాడు. ఇతడి కొడుకు మొదటి అమ్మరాజు రాజ్యనికొచ్చి ఏడేళ్లు పాలించాడు. క్రీ.శ. 927లో గోదావరి నది ఒడ్డున రాజమహేంద్రపురం (రాజమండ్రి) నిర్మించాడు. తర్వాత వేంగీ చాళుక్యులకు రాజమహేంద్రవరమే రాజధాని అయ్యింది.

విమలాదిత్యుడు

విమలాదిత్యుడు వేంగీ రాజ్యానికి క్రీ.శ. 1011 నుంచి క్రీ.శ. 1018 వరకు ఏడేళ్లు పాలించాడు. మొదటి రాజరాజచోళుని కుమార్తె కుందవైని వివాహమాడాడు. ఈమె ద్వారా రాజరాజు, రెండో భార్య మేలవ దేవి ద్వారా విజయాదిత్యుడు జన్మించారు. రాజరాజే, రాజరాజ నరేంద్రుడిగా సుపరిచితుడు. విమలాదిత్యుడికి సర్వలోకాశ్రయుడు, విష్ణువర్ధన మహారాజు, రాజమార్తాండుడు, ముమ్మిడి భీముడు అనే బిరుదులున్నాయి. మంత్రి వజ్జయ ప్రగ్గడకు రణస్తిపూడి గ్రామాన్ని అగ్రహారంగా ఇచ్చాడు. ఇతని సైన్యాధిపతి నృపకాపుడు. రామతీర్థం (విజయనగరం జిల్లా) శాసనం ప్రకారం విమలాదిత్యుడు జైనమతాభిమాని అని పేర్కొంది. త్రికాల యోగి సిద్ధాంత దేవుడు, జైన ఆచార్యుడు ఇతడి గురువని శాసనం తెలుపుతోంది.

రాజరాజ నరేంద్రుడు (క్రీ.శ. 1019-1060)

తూర్పు చాళుక్య వంశంలో రాజరాజ నరేంద్రుడు విశేష ఖ్యాతి గడించాడు. పాలనంతా యుద్ధాలతోనే గడిచింది. సవతి తమ్ముడైన విజయాదిత్యుడు అనేక ఆటంకాలు కలిగించాడు. కళ్యాణి చాళుక్య రాజు మొదటి సోమేశ్వరవర్మతో కలిదిండి దగ్గర రాజరాజు యుద్ధం చేశాడు. సర్వలోకాశ్రయుడు, సత్యాశ్రయుడుగా కీర్తి గడించాడు. చోళరాజరాజ కుమారుడైన రాజేంద్ర చోళుని కూతురు అమ్మంగ దేవిని వివాహమాడాడు. ఇతని కాలంలోనే ఆంధ్ర-ద్రావిడ సమ్మేళనం జరిగింది. రాజరాజ నరేంద్రుడు తెలుగుభాషకు, కులోత్తుంగ చోళుడు తమిళభాషకు ప్రాధాన్యతనిచ్చారు.

రాజరాజనరేంద్రుడి గురించి తెలుసుకోవడానికి నన్నయ రచించిన ఆంధ్ర మహాభారతం ప్రధాన ఆధారం. నన్నయ భట్టారకుడు ఆస్థాన కవి. రాజరాజ నరేంద్రుని ఇష్టదైవం ద్రాక్షారామ భీమేశ్వరుడు. బిరుదాంక భీముడు, భరగండ భైరవుడు, రాజ పరమేశ్వరుడు, రాజ రాజ నారాయణుడు అనే బిరుదులున్నట్లు ఆంధ్రమహాభారతం తెలుపుతోంది.

రాజరాజ నరేంద్రుని ఆస్థానంలో నన్నయ భట్టు, భీమన భట్టు, నారాయణభట్టు, ప్రముఖులు. నన్నయకు వాగనుశాసనుడు, ఆంధ్రకవిత్వ విశారధుడు, విద్యాదయుతుడు అనే బిరుదులున్నాయి. నన్నయ ఉభయ భాషా కావ్య రచనా శోభితుడిగా, నారాయణ భట్టు వాఙ్మయ దురంధురుడిగా కీర్తి చెందారు.

కులోత్తుంగ చోళుడు (1070-1120)

చాళుక్య రాజేంద్రచోళుడని కూడా పిలుస్తారు. కళింగ, చోళ, చాళుక్య రాజ్యాల్ని పాలించాడు. ఇతని కాలంలో తెలుగు దేశానికి ద్రావిడ బ్రాహ్మణులు విరివిగా వచ్చారు. దీని ప్రభావం వల్ల భాషలో మార్పు లొచ్చి ఎన్నో తమిళ పదాలు తెలుగులోకి చేరాయి. కులోత్తుంగ చోళుడు తమిళకవులు, తమిళ భాషను ఆదరించాడు.